కామెడీ కథ

# మేజర్-డేంజర్

కాశీభట్ల శశికాంత్

**ఫోన్ రింగయితే తీశాను.**

**"హలో"**

**"నేను సార్ శేషుని. అదే సన్మానాల శేషుని బాగున్నారా?"**

**"చాలా కాలానికి గుర్తొచ్చానే" అన్నాను.**

**"అదేం లేదు సార్. బిజీగా ఉండి ఈమధ్య కలవలేకపోయాం. మీరిపుడు తీరికగా ఉంటే చెప్పండి వస్తాం. మాట్లాడాల్సిన పనుంది."**

"రండి ఇంట్లోనే ఉంటాను" అని ఫోన్ పెట్టేశాను.

నేనొక రచయితను. తరుచుగా కాకపోయినా అడపా దడపా నా కథలు పత్రికలలో పడుతూ ఉంటాయి. పది సంవత్సరాలుగా కథలు రాస్తున్నా మా ఊరిలో, అదీ నేను ప్రచారం చేసుకుంటే తప్ప రచయితగా తగినంత గుర్తింపు రాకపోవడం పట్ల విచారపర్వంలో ఉన్న నాకు సన్మానం చేయించుకో ప్రముఖుడివి అవుతావు అని బోధ చేసి 'గుర్తింపు' అనే సన్మానాలు చేసే సంస్థ ఎడ్రస్ ఇచ్చాడు ఒక మిత్రుడు.

ఒకరోజు 'గుర్తింపు' ఆఫీసుకు వెళ్లాను. దానిని నడిపేది శేషు, చలం అని ఇద్దరు వ్యక్తులు. నా సన్మాన విషయం ఎలా ఎత్తాలా అని ఆలోచిస్తుంటే "ఎటువంటి సన్మానం కావాలో ఎంచుకోండి" అని ఒక లిస్టు నా చేతికి ఇచ్చారు. అందులో వివిధ రకాల సన్మానాలు వాటికి అయ్యే ఖర్చుతో సహా ఉన్నాయి. చీప్ అండ్ బెస్ట్‌గా అనిపించిన పద్ధతిని ఎంచుకొని బేరమాడబోతే ఆ విధంగా సన్మానం చెయ్యడానికి ఏ పనికి ఎంత ఖర్చు అవుతుందో వారికి మిగిలేదెంతో వివరించి చెప్పేసరికి వాళ్ల మీద నమ్మకం కుదిరింది. పనిలో పనిగా బిరుదు ప్రదానం కూడా కానిచ్చేద్దామన్నారు కానీ దానికి వాళ్లు ఎక్కువ రేటు చెప్పడమే కాక స్వతహాగా నా అంతటివాడికి కూడా సిగ్గు వెయ్యడంతో వద్దనేశాను. వాళ్లు చెప్పిన విధంగా చక్కగా సన్మానం చేశారు.

వాళ్లకి ఈ రోజు నాతో ఏం పని పడిందా అని ఆలోచిస్తుండగా జంటకవులలా ఇద్దరూ వచ్చారు.

"మీకు కృష్ణ తెలును కదా" వస్తూనే అన్నాడు శేషు.

"ఏ కృష్ణ?"

"కథలు రాస్తూ ఉంటాడు. సాహితీ సమావేశాలకు అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు"

"ఏమయింది అతనికి?" గుర్తు తెచ్చుకుంటూ అన్నాను.

"అతనికి సన్మానం చేస్తున్నాం"

అతనెవరో గుర్తొచ్చింది.

"అతను కుర్రాడే కదా. అప్పుడే సన్మానమా?"

"మీకున్న ఓపిక ఈ కాలం కుర్రాళ్లకి ఎక్కడిదండీ. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే ఆ సన్మాన సభకి ప్రధాన వక్తగా మీరుంటే బాగుంటుంది అని మా అభిప్రాయం" అన్నాడు చలం.

నాకు చాలా ఆనందం వేసింది. నాకు మైకుని చూస్తే తన్మయత్వం కలుగుతుంది. నాకు నేనుగా చెప్పుకోగూడదు కానీ ఉపన్యాస దిట్టను. ఏ విషయం మీదనైనా (విషయం లేకపోతే మరీ మంచిది) అనర్గళంగా మాట్లాడగలనని నా అభిమానులు అంటూ ఉంటారు. అభిమానులు అని బహువచనం వాడక్కర లేదు. ఉన్నది ఒక్కడే అర్భకుడు. వాడు కూడా అతని కింద పనిచేసే అసిస్టెంటు అని గిట్టని వారు ప్రచారం చేసినా వారి పాపాన వారే పోతారు అని వదిలేశానను కోండి. అది వేరే విషయం) అయినా ఉపన్యాసం ఇవ్వడం అంటే ఎంత కష్టమో వారికేం తెలుసు. దానికి ఎంతో ఏకాగ్రత కావాలి. ఆకతాయిలు కుక్క, పిల్లి వగైరా జంతువుల అరుపులు అరిచినా, అవాకులు చవాకులు పేలినా, వేదిక దిగిపోదామన్న ఆశతో చప్పట్లు చరిచినా చలించకుండా ఉండగలగాలి. కాకపోతే ఈమధ్య కొన్ని దుష్టగ్రహాలు, మైకుని చూస్తే నాకు కలిగే తన్మయత్వాన్ని పూనకంగా ప్రచారం చేసి నాకు మైకు అందకుండా అడ్డుకుంటున్నాయి. వాళ్లు ఎంత దాకా వెళ్లారంటే కనీసం వందన సమర్పణకి కూడా నోచుకోకుండా చేశారు.

"ఈ నెల 30న సన్మానం. ఆ రోజు మీకు కుదురుతుంది కదా"

ఆ రోజు నేను ఊరు వెళదామనుకున్నాను. కానీ తేదీ మార్చమంటే వాళ్లు ప్రధాన వక్తనే మార్చవచ్చు అనే భయంతో ఆ రోజు ఖాళీయే అని చెప్పాను.

"ఇంతకీ సభాధ్యక్షుడు ఎవరు?"

"చక్రధర్ అని మిలటరీ మేజర్" అన్నాడు శేషు.

"ఇలాంటి సభలకి మిలటరీ మేజర్ అధ్యక్షుడేమిటయ్యా" అసంతృప్తిగా అన్నాను.

"ఆయన కృష్ణకి మేనమామ. ఆయననే సభాధ్యక్షుడిగా పెట్టాలని కృష్ణ ముందే చెప్పాడు" అని కొంత గేప్ ఇచ్చి "మరి ఈ సన్మానానికి మీ కాంట్రిబ్యూషన్..." అన్నారు.

అదిరిపడ్డాను.

"నా సన్మానానికి చూపించిన ఖర్చులలో ప్రధాన వక్తకి మెమెంటో అని, ఆయనను తీసుకురావడానికి అయిన ఖర్చు అని చెప్పి, నా వంతు వచ్చేసరికి ఎదురు డబ్బు ఇమ్మంటారా?" చిరాగ్గా అన్నాను.

"ఇతను కుర్రవాడు. అంత ఖర్చు భరించలేనన్నాడు. అలా అని సన్మానం చెయ్యకుండా గాలికి వదిలేయలేం కదా. మీలాంటి పెద్దలు ఒక చెయ్యి వెయ్యాలి"

"సరేలెండి నూట పదహార్లు ఇస్తాను" అన్నాను నా వీక్‌నెస్‌ని కేష్ చేసుకుంటున్నారని తెలిసినా గత్యంతరం లేక.

"మీ స్థాయికి అది మరీ తక్కువ. కనీసం వెయ్యి నూట పదహార్లు ఇవ్వాలి"

"ఆఖరి మాట. అర్థవెయ్యి నూట పదహార్లు ఇస్తాను. ఇంక నన్ను ఇబ్బంది పెట్టకండి" అన్నాను.

"అలాగే కానివ్వండి. ఆహ్వాన పత్రాలు ప్రింటింగ్ అయ్యాక మళ్లీ కలుస్తాం" అని వాళ్లు వెళ్లిపోయారు.

"అదేమిటండీ. 30న మా అన్నయ్య వాళ్లింటికి వెళదాం అనుకున్నాంగా" నిలదీసింది నా భార్య.

"ఆ పల్లెటూరిలో ఒక సభ ఉండదు. సమావేశం ఉండదు. ఏ పనీ లేని వాడికి ఫరవాలేదు కానీ నా స్థాయి వాడికి ఏమీ తోచదు. కావాలంటే నువ్వు పిల్లలను తీసుకుని వెళ్లు" అన్నాను.

★ ★ ★

సన్మానం రోజున ఎంత త్వరగా వెళ్లాలి అనిపించినా ముందుగా వెళితే బాగుండదని అరగంట ఆలస్యంగా ఆహ్వానపత్రంలో సూచించిన ఆడిటోరియంకి వెళ్లాను.

ఆడిటోరియం బయట స్కూటర్లు, సైకిళ్లు ఉన్నాయి. కానీ ఒక్క మనిషి కూడా కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఆడిటోరియం గుమ్మానికి అడ్డుగా ఒక పొడుగాటి మనిషి మీసాలతో సహా నుంచుని ఉన్నాడు. నేను సమీపిస్తున్నా కదలలేదు. గోపికను వెళ్లనివ్వకుండా అడ్డుకునే కృష్ణుడిలా చేతులు గుమ్మానికి ఆనించి నుంచున్నాడు. చేతిలోని స్టిక్ ఫ్లూట్‌లా బాగా కుదిరింది. ఒంటిరంగు ఎలాగూ సరిపోయింది. నెమలిపింఛం ఒక్కటే తక్కువ. అంతే కాదు కృష్ణుడికి అంత గుబురు మీసాలు ఉండవు. మహా అయితే నాజూకు మీసాలు ఉంటాయేమో. ఇంతకీ కృష్ణుడికి మీసాలు ఉంటాయా లేదా?

అడ్డంగా నుంచున్న మనిషి మీసాలను చూస్తూ పౌరాణిక సినిమాలను గుర్తు చేసుకోసాగాను. నా సందేహం తీరేలోగానే మీసాల గుబురులోంచి మాటలు బుల్లెట్లలా దూసుకువచ్చాయి.

"సభ ఎన్నిటికి?"

"ఆరింటికి" అన్నాను.

"ఇప్పుడు టైం ఎంతయింది?"

"ఆరున్నర"

"అరగంట ఆలస్యంగా వచ్చావేం?"

ఏకవచన ప్రయోగానికి ఉలిక్కిపడ్డాను. ఎంత ధైర్యం. అయినా సరే శత్రువు వివరాలు తెలుసుకోకుండా యుద్ధానికి దిగే తెలివితక్కువ ప్రయత్నం చెయ్యదలచుకోలేదు.

"మీరెవరు?" మీసాలను చూస్తూ అనుకోకుండా బహువచనంలో అడిగేశాను.

"మేజర్ చక్రధర్" అన్నాడు నడుము మీద చేతులు పెట్టుకుంటూ ఎన్టీఆర్‌లా. కృష్ణ మేనమామ అన్న మాట. నేనెవరో తెలిశాక తొందర పడ్డందుకు పశ్చాత్తాప పడతాడు.

"నేనెవరో తెలుసా?" అతనిలాగే నడుము మీద చేతులు పెట్టుకుంటూ అన్నాను.

"ఎవరో?" వ్యంగ్యంగా అన్నాడు. ఎంత పొగరు. రంగులో తప్ప కృష్ణుడికీ వీడికీ పోలిక లేదు. వీడికి అయితేగియితే కంసుడి పోలికలు ఎక్కువగా ఉన్నాయి. అరె భలే కుదిరిందే. కృష్ణకి మేనమామ అంటే కంసుడేగా. నవ్వుని పెదవుల మధ్య దాచాను.

"ప్రధాన వక్తను నేనే" సినిమా చివరలో విగ్గుదీసి అసలు రూపాన్ని బయటపెట్టిన హీరోలా అన్నాను.

"బుద్ధుండాలి. ప్రధాన వక్తవి అయి ఉండి సమావేశానికి అలా గంట ఆలస్యంగా వస్తావా?" కోపంగా అన్నాడు చక్రధర్.

ఎంత మాట అనేశాడు. వీడిని ఎలా ఎదుర్కోవాలి. బుర్రకి పదును పెడితే 'కౌన్ బనేగా కరోడ్ పతి'లోలా నాలుగు ఆప్షన్స్ తట్టాయి. (ఎ) మాటలతో ఎదుర్కోవడం. (బి) ముష్టి యుద్ధానికి దిగడం (సి) తలవంచుకుని లోపలకు వెళ్లిపోవడం. (డి) తీవ్ర నిరసనను వ్యక్తం చేసి వెనక్కి వెళ్లిపోవడం.

ఒక్కొక్కదాని గురించి విడివిడిగా ఆలోచించాను. మైకు ముందయితే అదరగొడతాను కానీ వాగ్యుద్ధాలు మనవల్ల కాదు. ఆప్షన్ ఎని తీసేశాను. ఆప్షన్ బిని ఎన్నుకునే మూర్ఖుడిని కాదు. ఆప్షన్ సిని ఎంచుకోవడానికి మనస్సు ఒప్పలేదు.

"డి" అని పైకే అనేశాను పరాకుగా.

"డి ఏమిటి?" చిరాకుపడ్డాడు చక్రధర్.

"ప్రధాన వక్తగా పిలిచి అవమానం చేస్తారా. శేషాచలాల సంగతి తేలుస్తాను. నేనంటే ఏమిటనుకుంటున్నారో" అని వెనుతిరిగాను.


"ఎక్కడికి?" అన్నాడు చక్రధర్. వీడి ప్రశ్నల దాహం ఇంకా తీరినట్టు లేదు.

"ఎక్కడో అక్కడికి. గతిలేక వచ్చాననుకుంటున్నారా?" వెనక్కి తిరిగి చూడకుండా అన్నాను.

"ఆగు. మళ్లీ మేము ప్రధాన వక్తని వెతుక్కోవాలా? లోపలికి పద" జబ్బ పట్టుకుని ఆపి అన్నాడు. మాటలనైతే ఎదుర్కోవచ్చేమో కానీ బలప్రదర్శన అంటే నాకు చిరాకు.

అతని దౌర్జన్యాన్ని మనసులోనే నిరసిస్తూ లోపలికి నడిచాను.

'గుర్తింపు' వాళ్లు ఎప్పటిలానే జనాన్ని బాగానే పోగు చేశారు. అందరూ క్లాసులోని మంచిపిల్లలలా నిశ్శబ్దంగా ఉన్నారు. ఆ పోలిక సరికాదేమో. సంస్మరణ సభలో మౌనం పాటించే వారిలా ఉన్నారు. ఆ సమయంలో సంస్మరణ సభ గుర్తుకు రావడం అపశకునంగా అనిపించింది. శేషు, చలం సభలో ఆ చివర కనిపించారు. విసురుగా అటు వెళ్లిబోయేసరికి వెనక



నుంచి మళ్లీ బుల్లెట్లు పేలాయి.

"అటెక్కడికి. నీ సీటు ముందు వరుసలో ఉంది కూర్చో"

తలవంచుకుని వెళ్లి నాకు కేటాయించిన సీట్లో కూర్చున్నాను. ఇంకా ఎవరైనా వస్తారేమోనని చక్రధర్ గుమ్మం దగ్గరే కాశాడు. కొద్దిగా ధైర్యం తెచ్చుకుని తల వెనక్కి తిప్పి చూశాను. వెనక వరసలో మా సాహితీ మిత్రులందరూ ఉన్నారు. కాకపోతే ఒక్కరిలోనూ జీవం ఉన్నట్టు లేదు. "ఏమిటండీ ఈ దారుణం?" ఒకతను ధైర్యం చేసి అన్నాడు. దాంతో ఒక్కొక్క గొంతే లేవసాగాయి. వరద బాధితులిలా అందరూ ఒక్కసారే మాట్లాడసాగారు.

"ఊర్కోండయ్యా. చెప్పినా వినిపించుకోకుండా ఇలా గట్టిగా మాట్లాడితేనే శంకరం గారిని పెద్దవారని కూడా చూడకుండా కొట్టినంత పనిచేశాడు" అన్నారొకరు. నేను శంకరంగారి కేసి చూశాను. ఆయన నాలుగు వేళ్లు మడిచి, బొటనవేలితో నుదుటిమీద రానుకున్నారు నా తలరాత అన్నట్టు. చక్రధర్ చూస్తాడేమో అని ఆగాను కానీ లేకపోతే లేచి బాంగ్రా డాన్స్ చెయ్యాలనిపించింది. మా బాగా అయింది. నన్ను వేదికకి దూరం చేస్తున్న దుష్టగ్రహాలకి అధిపతి ఈయనే. కంసుడు తాత్కాలికంగా దుష్టశిక్షణ చేసే కృష్ణుడయిపోయాడు. ఆనందాన్ని మనసులోనే దాచుకుని నాకు చేతనయినంత బాగా విచారాన్ని అభినయించాను.

చక్రధర్ లోపలికి వచ్చాడు.

"ఆ తలుపులు మూసెయ్యండి. సభ మధ్యలో ఎవరిష్టం వచ్చినట్టువాళ్లు వెళ్లడం, రావడం చేస్తే నాకు చిరాకు" అన్నాడు. తలుపులు మూసుకుంటుంటే చక్రధర్‌కి డయ్యర్ అనే పేరు సరిగ్గా సూటవుతుందని ఎందుకో అనిపించింది. డయ్యర్‌కి, తలుపులు మూసుకోవడానికి సంబంధం ఏమిటో మాత్రం ఆ విపత్కర పరిస్థితులలో ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు.

సభ ప్రారంభం అయింది. కృష్ణ మొహంలో సన్మానం చేయించుకుంటున్న హుషారే లేదు. చేజేతులా చేసుకున్నాడు. ఎవరేం చేస్తారు. నాకన్నా ముందు ఇద్దరు వక్తలు ఉన్నారు. మొదటి ఆయన తన పేరు పిలవగానే ఏవో సంజ్ఞలు చేశాడు మైకు దగ్గరకు వెళ్లకుండా.

"ఏమొచ్చింది నీకు?" గర్జించాడు మేజర్.

"గొంతు పోయింది" అన్నాడతను గొంతు పోయిన వాడు రహస్యంగా మాట్లాడినట్టు. ఇంతకుముందు శంకరంగారిని చక్రధర్ కొట్టినంత పనిచేశాడు అని స్పష్టంగా చెప్పింది ఇతనే. ఏం రిస్క్ వస్తుందో అని ముందు జాగ్రత్త పడ్డాడన్నమాట. రెండవ అతను మూడే ముక్కల్లో తను చెప్పాలనుకున్నది ముగించి బ్రతుకు జీవుడా అని కూర్చున్నాడు.

ఇంక నా వంతు వచ్చింది. బిక్కు బిక్కుమంటూ మైకు ముందుకు వెళ్లాను. మైకుని చూడగానే భయం ఎగిరిపోయి మాటలు ఉప్పొంగాయి. మరి ఇతను మిలటరీలో మేజర్ అయితే నేను ఉపన్యాసాలలో బ్రిగేడియర్‌ని. శేషు, చలం నన్ను కలవడం దగ్గర మొదలుపెట్టి ఎంతో బిజీగా ఉండి కూడా ఎటువంటి పరిస్థితుల్లో ఇక్కడికి రావడానికి ఒప్పుకోవలసి వచ్చిందో వివరించడం మొదలుపెట్టాను. కొద్దిసేపు విని చక్రధర్ చిరాకు పడ్డాడు.

"ఆ సోదంతా మాకెందుకు. విషయంలోకి రా" అన్నాడు.

సమస్యను శాంతియుతంగా పరిష్కరించదలిచి "మేజర్ గారు చక్కగా గుర్తు చేశారు. విషయంలోకి వస్తున్నాను" అని "గురజాడ తన రచనలలో" అని సాహిత్యానికి సంబంధించి నేను తరుచుగా చేసే ఊకదంపుడు మొదలుపెట్టాను. మేజర్‌కి ఓపిక మరీ తక్కువ. "గురజాడ దగ్గర మొదలుపెట్టావు. కృష్ణ దగ్గరకు వచ్చేసరికి ఎంతసేపు పడుతుందో" అని అరిచాడు బి.పి. పేషెంట్‌లా. అంటే నేను తెల్లజెండా ఊపినా బుల్లెట్ల వర్షం ఆపదలచుకోలేదన్నమాట. ఈ మేజర్‌కి యుద్ధనీతీ తెలియదు. నేను అరిస్తే మైకు వదిలే రకం కాదనీ తెలియదు.

"చక్రధర్ గారు మంచి హాస్య చతురులు" అని కృష్ణ గురించి మాట్లాడటం మొదలుపెట్టాను.

"కృష్ణ సామాజిక స్పృహ ఉన్న రచయిత. సమకాలీన సమస్యల మీద ఎన్నో మంచి రచనలు చేశాడు. ఇతని రచనలలోని పాత్రలు ఊహాలోకంలో కాకుండా మన మధ్య తిరిగే వ్యక్తులలాగే అనిపిస్తాయి" అంటూ చెప్పుకుపోతున్నాను.

"నువ్వసలు కృష్ణ కథలు చదివావా?" సౌమ్యంగా అడిగాడు మేజర్. అరిచిన దానికన్నా ఇది మరింత భయంకరంగా ఉంది. చదివానన్నట్టుగా తల ఊపాను ప్రమాదాన్ని శంకిస్తూనే.

"విన్నారు కదా ఈ పెద్దమనిషి మాటలు. కృష్ణ రాసినవన్నీ చిన్న పిల్లల హాస్య కథలయితే సమకాలీన సమస్యల మీద రాశాడంటున్నాడు. ఆ రాజులు కిరీటాలతో సహా మన మధ్యన తిరిగే వ్యక్తులట" వ్యంగ్యంగా అన్నాడు.




ఓస్ ఇంతే కదా. దీనికి ఇంత హడావుడి పడతాడెందుకు ఈ మేజర్. మరీ విడ్డూరం కాకపోతే, కృష్ణ సన్మాన సభలో మాట్లాడాలంటే అతని రచనలు చదివి ఉండాలా. ఏదో మాటవరసకి చదివాం అంటాం అంతే. నేను గతంలో బోలెడు సభలలో ఈ విధంగా ప్రసంగించాను. ఒక్కోసారి మైకు ముందుకు వచ్చేసరికి సభ ఎందుకు ఏర్పాటు చేశారో మరిచిపోయినా మేనేజ్ చేసేసేవాడిని.

"తన సన్మాన సభకి అధ్యక్షత వహించమని కృష్ణ అడిగినపుడు ఏవో నాలుగు కథలు రాయడం తప్ప సన్మానం చేయాల్సినంతగా ఏం సాధించాడా అని ఆశ్చర్యపోయాను. అదేమిటో తెలుసుకోవాలనిపించింది. ఈ సభ ఏర్పాట్లు, ఇతని ప్రసంగం విన్న తర్వాత ఇదంతా ఏదో పెద్ద గూడుపుఠానీలా అనిపిస్తోంది. ఇందాకటి నుంచి నా కోపాన్ని అణుచుకుంటున్నాను. ఇంక నా వల్ల కాదు. ఈ బి.పి. కంట్రోల్ అవ్వాలంటే ఒకటే పద్ధతి" అని ఒంగేడు. అప్పటిదాకా నేను గమనించలేదు. కుర్చీ పక్కనే పెద్ద గన్ ఉంది. దానిని తీశాడు.

"ఇపుడు ఎవరో ఒకరిని కాలిస్తేనే కానీ నా కోపం చల్లారదు" అని చుట్టూ చూసి "ఎవరినో ఎందుకు వీడినే కాలుస్తాను" అని నా గుండెలకేసి గురిపెట్టాడు.

"సన్మానం చేసేవాళ్లు, చేయించుకునేవాడూ బాగానే ఉన్నారు. మధ్యలో నన్ను కాలుస్తాననడం అన్యాయం. మరీ తప్పదు అనుకుంటే శేషుని, చలాన్నీ కాల్చేయండి. వాళ్లే ఇలాంటి సన్మానాలు చేయిస్తూ ఉంటారు. నా దగ్గర డబ్బు కూడా తీసుకున్నారు" కంగారుగా అన్నాను.

ఏ కళనున్నాడో మేజర్ మొదటిసారి మా మాటవిని చుట్టూ చూశాడు. వాళ్లిద్దరూ సభలో లేరు. తలుపులు వేసున్న సభలోంచి జాదూ రత్నాల్లా మాయమయిపోయారు. గన్ మళ్లీ నాకేసి తిరిగింది. వేలు ట్రిగ్గర్ మీద బిగుసుకుంటోంది. సభలోని జనం ఆత్రుతతో లేచి నుంచున్నారు. ఇతనికి ఈ గన్ ఎలా వచ్చింది? మిలటరీ వాళ్లు గన్ ఇంటికి ఇస్తారా? ఎవరినైనా కాలిస్తే కేసు ఉండదా? ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చిందే. సొమ్ము పోయె, శనిపట్టె. ఇలా ఒక్క క్షణంలో ఎన్నో ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. తుపాకీ పేలింది. పెద్దగా అరిచి ఉలిక్కి పడి లేచాను.

"ఏమయిందండి?" గాభరాగా అంది నా భార్య. "ఏమీ లేదు. కానీ 30న ముందు అనుకున్నట్టుగా మీ అన్నయ్య వాళ్ల ఊరువెళదాం" గుండెదడ తగ్గాక అన్నాను.

"ఏం నిర్ణయం మార్చుకున్నారు?" నా అసందర్భపు సంభాషణకి ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"ఆ పల్లెటూరిలో సభలుండవు. సన్మానాలుండవు. మేజర్లు అసలు ఉండరు. అక్కడికే వెళదాం" అన్నాను.